క్లుప్తంగా...

నేడు మండల పరిషత్ సమావేశం

మేడ్చల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల మండల అధికారులు సకాలంలో పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

ఘట్‌కేసర్ సీఐగా మహేందర్‌రెడ్డి



ఘట్‌కేసర్ సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మహేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన అశోక్‌రెడ్డి పోచారం పీఎస్‌కు బదిలీ కాగా మీర్‌పేట్ సీఐగా పనిచేసిన మహేందర్‌రెడ్డి ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చాడు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన వారితో అకాడమి సిబ్బంది, కోచ్

మేడ్చల్: కొంపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన జాగుర్ తైక్వాండో స్పోర్ట్స్ అకాడమికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 21 బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. కొంపల్లిలో జూనియర్, సబ్ జూనియర్, కేడట్ స్థాయిలో విద్యార్థులకు జిల్లాస్థాయిలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. అకాడమికి చెందిన 13 మంది బంగారు, ఏడుగురికి వెండి, ఒకరు కాంస్య పతకాలను సాధించారు. వారిని కోచ్ శ్రీనుగౌడ్ సత్కరించి అభినందించారు.

బండి సంజయ్‌పై ఫిర్యాదు

జవహర్‌నగర్: ఖమ్మంలో నిర్వహించిన నిరుద్యోగ యాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ యువతను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ అహ్మద్ పాషా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించేలా మాట్లాడిన సంజయ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఘట్‌కేసర్: ఘనాపూర్ గ్రామానికి చెందిన వన్నాల భాస్కర్‌కు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, టీఆర్ఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం అందజేశారు. అనారోగ్యంతో భాస్కర్ ఆస్పత్రిలో చికిత్స పొందగా సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. కృష్ణగౌడ్, అర్జున్, పవన్, శరత్‌గౌడ్, హరికృష్ణ, సురేశ్ పాల్గొన్నారు.

సోమారం సర్పంచ్‌పై సస్పెన్షన్ వేటు

మేడ్చల్: మేడ్చల్ మండల పరిధిలోని సోమారం గ్రామ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. సోమారం గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై డివిజన్ పంచాయతీ అధికారి ఎంపీవోకు విచారణకు ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.11,79,407 అభ్యంతర ఖర్చు చేసినట్టు, తిరిగి రాబట్టాల్సిన ఖర్చులు రూ.8,08,423 దుర్వినియోగం చేసినట్లు వచ్చిన ఆరోపణలపై నివేదిక సమర్పించాలని డీఎల్పీవో కోరారు. అలాగే సర్పంచ్ కరుణాకర్ రెడ్డిపై పంచాయతీ సమావేశాలు నిర్వహించడం లేదని, పంచాయతీ పరిధిలోని అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై విచారణ జరిపిన ఎంపీవో నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా సర్పంచ్ పదవి నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా నివేదిక సమర్పించని కారణంగా ఎంపీవో నివేదికతో ఏకభవిస్తూ కరుణాకర్‌రెడ్డిని సర్పంచ్ పదవి నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరిగి రాబట్టాల్సిన మొత్తం రూ.8,08,423లో సర్పంచ్, ఉప సర్పంచ్లు రూ.4,03,211.50 చొప్పున పంచాయతీ నిధులకు ఏడు రోజుల్లో జమ చేయాలని ఆదేశించారు. లేనిచో రెవెన్యూ ఆర్ఆర్ చట్టం కింద రాబట్టాల్సి ఉంటుందని కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కోల్డ్‌వార్

- పైసలిస్తే సరే లేకుంటే ఫిర్యాదులే..
- పాలకవర్గం చీలికలు
- బీఆర్ఎస్‌కు తలనొప్పిగా కార్పొరేటర్ల వైఖరి
- ఒకరి భూముల్లో మరొకరు ఫిర్యాదులు
- పనులు లేక పైరవీలపైనే మొగ్గు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల మధ్య కోల్డ్ వార్ మొదలైంది. పైసలిస్తే సరే లేకుంటే ఫిర్యాదులేనంటూ కొందరు కార్పొరేటర్లు సవాల్ విసరడంతో రగడ మరింత పెరుగుతోంది. డివిజన్లలో అభివృద్ధి చేయాల్సిన కార్పొరేటర్ల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. దీంతో ఒక డివిజన్ చెందిన అధికార పార్టీ కార్పొరేటర్ మరో డివిజన్ కార్పొరేటర్‌పై ఆరోపణలు చేయడంతో జవహర్‌నగర్‌లో రాజకీయం మరింత వేడెక్కింది.

అంతర్గతంగా అంతా కలహాలే..

జవహర్‌నగర్ పాలకవర్గంలో పైకి మాత్రమే కలిసున్నట్లు కనిపిస్తున్నారు. లోలోపల మాత్రం ఒకరిపై మరొకరు కత్తులు నూరుతున్నారు. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన 20 మంది కార్పొరేటర్లు ఉండగా ముగ్గురు బీఆర్ఎస్ రెబల్స్(ఇండిపెండెట్లు) మద్దతు తెలపడంతో ఎలాంటి పోటీ లేకుండానే మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు బీఆర్ఎస్‌కు దక్కాయి. మేయర్‌గా 15వ డివిజన్ కార్పొరేటర్ కావ్య, 8వ డివిజన్ కార్పొరేటర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌ను డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ నుంచి ముగ్గురు కార్పొరేటర్లు..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ముగ్గురు కార్పొరేటర్లు 3వ డివిజన్ కార్పొరేటర్ బల్లి రోజా, 20వ డివిజన్ కార్పొరేటర్ కుతాడి సాయి, 21వ డివిజన్ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ కాంగ్రెస్ నుంచి గెలిచారు. సంవత్సరం పాటు కాంగ్రెస్‌లో కొనసాగి అనంతరం కేటీఆర్ సమక్షంలో అభివృద్ధి పేరున బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఇంటి నిర్మాణాలకు డబ్బుల వసూళ్లు..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో నూతన ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి పర్మిషన్లు ఇవ్వకపోవడంతో కొందరు కార్పొరేటర్లు స్లాబ్‌కో రేటు ఫిక్స్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయంపై గతంలో ఎన్నోసార్లు బాధితులు ఆరోపణలు చేశారు. దీంతో మంత్రి మల్లారెడ్డి వారిని పిలిపించి మందలించిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

ఖాళీ స్థలాలపై కన్ను..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ఖాళీ స్థలాలపై కొందరు కార్పొరేటర్లు, నాయకుల కన్ను పడింది. పైసలిస్తే సరే లేకుంటే ఫిర్యాదు చేస్తామని బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. ఇటీవల కొందరు కార్పొరేటర్లు అభివృద్ధి పేరున బేరం కుదరకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

కార్పొరేటర్లకు షోకాజ్ నోటీసులు..

జవహర్‌నగర్‌లో కొందరు కార్పొరేటర్ల భూఆక్రమణలపై సంజాయిషీ ఇవ్వాలంటూ గతంలో కలెక్టర్, కమిషనర్ నోటీసులు జారీ చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, ప్రభుత్వ భూముల్లో మున్సిపల్ బోర్డులు ఏర్పాటు చేసి ఆక్రమించారని, దీనిపై సమగ్ర విచారణ చేసి వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కార్పొరేటర్ల భర్తల హవా..

జవహర్‌నగర్‌లో కార్పొరేషన్‌లో మహిళా కార్పొరేటర్ల భర్తల హవా కొనసాగుతోంది. కార్పొరేషన్ కార్యాలయంలో అధికారిక కార్యక్రమంలో సతులు కాకుండా పతులు హాజరుకావడంతో కార్పొరేటర్ల భర్తల హవా కొనసాగుతోంది. అధికారిక కార్యక్రమాల్లో సైతం కార్పొరేట్ల భర్తలు పాల్గొంటున్నారు. దీంతో అధికారులు సైతం వారికి ఏమీ చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు.

పాలకవర్గంలో చీలికలు..

కొంతకాలంగా పాలకవర్గంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యుల మధ్య చీలికలు ఏర్పడ్డాయి. అవిశ్వాసానికి ముందు తర్వాత ఎన్నో పరిణామాలు చోటుచేసుకున్నాయి. కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానం పెట్టిన డిప్యూటీ మేయర్ తన అనుచర కార్పొరేటర్లతో క్యాంపునకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు చేశారు. స్థానికంగా ఉన్న మేయర్ మాత్రం మంత్రి అండదండలతో పావులు కదిపి క్యాంపు రాజకీయాలపై నీలినీడలు కమ్మేలా చేసింది. ప్రస్తుతం రాజకీయం అంతా తారుమారైంది. ఇక్కడి నుంచి అక్కడికి.. అక్కడి నుంచి ఇక్కడికి కార్పొరేటర్లు తరలివెళ్లడంతో సమన్వయం లోపించింది.

కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్‌పై ఆగ్రహం

మాకు సంబంధంలేని భూ వ్యవహారంలో మా పేరుతో అసత్య ఆరోపణలు చేయడంపై 3వ డివిజన్ కార్పొరేటర్ బల్లి రోజా కౌన్సిల్ సమావేశంలో 25వ డివిజన్ కార్పొరేటర్ నవీన్‌పై మండిపడ్డారు. కార్పొరేటర్‌గా నామినేషన్ వేసినప్పుడే ఎక్కడ భూములు ఖాళీగా ఉన్నాయో చూసి అక్కడే నామినేషన్ వేయాలని, ఇప్పుడు డబ్బుల కోసం వేధించడం సబబుకాదన్నారు.

ఒకరిపై మరొకరు ఆరోపణలు..

అభివృద్ధి విషయంలో పోటీ పడే కార్పొరేటర్లను మనం చూశాం. కానీ జవహర్‌నగర్‌లో మా డివిజన్లలో ఖాళీ స్థలాలు లేవు మాకూ వాటా ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్న కార్పొరేటర్లను చూసి ఆశ్చర్యం కలుగుతోంది. జవహర్‌నగర్‌లోని సర్వే నెం.266లో కొద్ది రోజులుగా భూవివాదం తలెత్తుతోంది. 20 ఏళ్ల క్రితం జరిగిన లావాదేవిల్లో భూయజమాని అందులో ఉన్న 4 ఎకరాల 37 గుంటల భూమిలో 3 ఎకరాలకు పైచిలుకు అమ్మేశాడు. మిగిలిన భూమిని ఒకరికి ఎకరా మరొకరికి అర ఎకరా విక్రయించాడు. భూయజమాని భూమి విక్రయించి తానే వ్యవసాయం చేయడంతో సమస్య జఠిలమైంది. ఆదివారం కొందరు ప్లాట్ల బాధితులను 25వ డివిజన్ కార్పొరేటర్ జమాల్‌పూర్ నవీన్‌కుమార్ తీసుకుని భూమిమీదికి వెళ్లి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 3వ డివిజన్ బల్లి రోజా భర్త శ్రీనివాస్ మమ్మల్ని అడ్డుకుంటున్నాడని ఆరోపణలు చేయడంతో సమస్య తీవ్రతరమైంది.

కార్పొరేటర్‌పై పరువునష్టం దావావేస్తా

సర్వే నెం.226లో నాకు సంబంధం లేని భూమిలోకి వెళ్లి.. నాపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదని, 3వ డివిజన్ కార్పొరేటర్ బల్లి రోజా భర్త బీఆర్ఎస్ నాయకుడు బల్లి శ్రీనివాస్ 25వ డివిజన్ కార్పొరేటర్ నవీన్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జవహర్‌నగర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి కార్పొరేటర్ నవీన్‌కుమార్‌పై మండిపడ్డారు. డబ్బుల కోసమే నవీన్ తనపై ఆరోపణలు చేస్తున్నాడని, ఆయన బెదిరింపులకు భయపడేదిలేదన్నారు. ఆ భూమిలో నాకు సంబంధం ఉందని నిరూపిస్తే బల్లి రోజా కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తుందని, లేకుంటే నువ్వు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తనపై తప్పుడు ప్రచారాలు చేస్తే పరువునష్టం దావా వేస్తానన్నారు.

– బల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు

అధికారిక సమావేశాల్లో.. అనధికారిక వ్యక్తులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ నుంచి సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌తో పాటు అధికారులతో జరిపిన సమీక్ష సమావేశంలో జిల్లాకు చెందిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అనధికారిక పీఏ ఒకరు పాల్గొనడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అధికారిక సమావేశాలు, సమీక్షల్లో ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలతోపాటు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని, అలాంటప్పుడు ఈ సమావేశాల్లో మంత్రి అనాధికారిక పీఏ పాల్గొనడంపై పలువురు జిల్లా అధికారులు అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

మచ్చుకు కొన్ని..

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల విజయవంతంపై ఇటీవల కలెక్టరేట్‌లో మంత్రి మల్లారెడ్డి నిర్వహించిన సన్నాహక సమావేశంలో కూడా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనధికారికంగా పాల్గొన్నారని బీజేపీ ప్రజాప్రతినిధులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ప్రజాసమస్యలను మంత్రితో సహా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్న సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమపై దాడి చేశారని బీజేపీకి చెందిన ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీలు ఆరోపించారు. అనాధికారికంగా సమావేశంలో పాల్గొనంతోపాటు ప్రజా సమస్యలను మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లుతున్న సందర్భంగా తమపై దాడి చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, సమావేశానికి అనుమతించిన అధికారులపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీ, మండల ప్రజాపరిషత్, గ్రామ పంచాయతీ సమావేశాల్లో కూడా సభ్యులు కాని వారు పాల్గొంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పీఏలు, అనుచరులు, వారి పార్టీ కార్యకర్తలు కూడా సమావేశాల్లో పాల్గొంటున్నా.. పట్టించుకోవడం లేదని, పలువురు విపక్ష ప్రజాప్రతినిధులు విమర్శిస్తున్నారు.

మృగశిర కార్తెలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమా

సాక్షి, మేడ్చల్ జిల్లా: మృగశిర కార్తెలో భాగంగా జూన్ 8, 9, 10 తేదీల్లో చేపల ఆహార మేళా(ఫిష్ ఫుడ్ ఫెస్టివల్) నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి బి.పూర్ణిమా తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట్ పెద్ద చెరువు వద్ద 10 స్టాల్స్‌ను ఏర్పాటు చేసి అందులో వివిధ రకాల చేపలు, రొయ్యలు, ఇతర ఆహార ఉత్పత్తుల వంటకాలను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలు, ముఖ్యంగా వినియోగదారుల్లో చేప ఆహార ఉత్పలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్య పోషణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. చేపలు, రొయ్యల విలువ ఆధారిత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచడం, చేపలు, రొయ్యలు, పీతలు అమ్మడం వల్ల ఉపాధిని పొందడం, ఆదాయాన్ని సమకూర్చుకోవడంపై అవగాహన కల్పిస్తామన్నారు. మృగశిర కార్తె సందర్భంగా చేపల ద్వారా తయారు చేయు వివిధ ఉత్పత్తుల మేళా నిర్వహించి, వినియోగం పెంచడం లక్ష్యంగా ఎంచుకోనున్నట్లు తెలిపారు. అందుకోసం మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాలు, నిథమ్‌లో శిక్షణ తీసుకున్న మహిళలు, మొబైలిష్ రిటైల్ లబ్ధిదారులకు స్టాల్స్ ఏర్పాటు కోసం ఆహ్వానించడం జరిగిందన్నారు. ఫిష్ ఫెస్టివల్‌లో ఫిష్‌ఫ్రై, ఫిష్ బిర్యానీ, హోల్ ఫిష్ ఫ్రై, అపోలో పిష్, ఫిష్ పకోడి, ప్రాన్స్‌ఫ్రై, ప్రాన్స్ బిర్యాని, మొజిటోస్, క్రిస్పీ ప్రాన్స్, ఫిష్ మోమోస్ మొదలకు వంటకాలను విక్రయిస్తారన్నారు. ఇంకా ఎవరైనా స్టాల్స్ పెట్టాలనుకున్నవారు కలెక్టరేట్‌లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.

వైభవంగా దశాబ్ది వేడుకలు

- జంక్షన్లలో ఆర్చీలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు
- పల్లె, పట్టణ, పారిశ్రామిక ప్రగతిపై డాక్యుమెంటేషన్
- విద్య, వైద్యం, పచ్చదనం, నీటి రంగంపై ప్రచారం
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: 21 రోజులు నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు తగిన కార్యాచరణతో అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జూన్ 2 నుంచి 22 వరకు జరిగే దశాబ్ది వేడుకల్లో జిల్లా ప్రగతి చాటేలా ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తం కావాలన్నారు.

- నోడల్ అధికారులు షెడ్యూల్ ప్రకారం 2014కు పూర్వం, ఇప్పటి వరకు సాధించిన ప్రగతిపై నియోజకవర్గం, మండలం, గ్రామాలవారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రగతిపై కరపత్రాల పంపిణీ, లబ్ధిదారుల విజయగాథలు నలుగురికీ తెలిపేలా కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు.
- జిల్లాలో ప్రధాన కార్యాలయాలతో పాటు దేవాలయాలు, చర్చిలు, ప్రార్థన మందిరాల ప్రదేశాల్లో 21 రోజులపాటు విద్యుత్ దీపాలతో అలంకరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా ప్రవేశం, ముగింపు ప్రాంతాలు, పురపాలక సంఘాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోని జంక్షన్లలో ఆర్చీలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.
- డాక్యుమెంటేషన్‌తో పాటు వీడియో చిత్రీకరణకు సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. ఊరురా చెరువుల పండుగ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పెద్ద చెరువు వద్ద బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, కట్ట మైసమ్మ పూజలతోపాటు భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.
- పోలీస్ ఆధ్వర్యంలో సురక్షా దివస్, తెలంగాణ రన్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి, సాగునీటి రంగంలో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. 9న సంక్షేమ సంబురాలు సందర్భంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండో విడత గొర్రెల పంపిణీ, ఇళ్ల పట్టాల పంపిణీ, బీసీ కులవృత్తుల ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.
- వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో సాధించిన ప్రగతి, కొత్త ఆసుపత్రుల ఏర్పాటు, అందిస్తున్న అదనపు వైద్య సేవలను వివరించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. పల్లె పట్టణ ప్రగతి సాధించిన విజయాలు ఘనంగా చాటుతామన్నారు.
- పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటింటికీ తాగునీటి సరఫరా, గిరిజనోత్సవం, పచ్చదనం, విద్యాశాఖలో సాధించిన ప్రగతి పేర్కొంటామన్నారు. ఆధ్యాత్మిక రంగంలో సాధించిన ప్రగతి, అమరుల త్యాగాలపై పలు కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, అభిషేక్, డీఆర్ఓ లింగ్యానాయక్, డీసీపీ సందీప్, జెడ్పీ సీఈవో దేవసహాయం, ఆర్డీవోలు రవి, మల్లయ్య, డీఆర్డీవో పద్మజారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీపీఓ రమణమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు మేరీ రేఖ, శ్రీనివాస్, జానకీరావ్, నీరజ గాంధీ పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాష్ట్రం దేశానికే మోడల్

జవహర్‌నగర్ మేయర్ కావ్య



మాట్లాడుతున్న మేయర్ కావ్య

జవహర్‌నగర్: అభివృద్ధిలో రాష్ట్రం దేశానికే మోడల్‌గా నిలుస్తోందని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ మేకల కావ్య అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను వైభవంగా జరుపుకుందామన్నారు. గతంలో జవహర్‌నగర్ అభివృద్ధికి నోచుకోకుండా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే అభివృద్ధి పనులతో జవహర్‌నగర్ మారిపోయిందన్నారు. దశాబ్ది వేడుకల్లో అధికారులు అలసత్వం ప్రదర్శించరాదన్నారు. అనంతరం రూ.1.3 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఆర్‌వో ప్రభాకర్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్ ఎంపీటీసీపై దాడి చేసిన టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి, ఎంపీటీసీ శోభారాణి డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం తెలంగాణ మహిళా కమిషన్ అధ్యక్షురాలు సునీతా లక్ష్మారెడ్డికి స్వయంగా ఫిర్యాదు చేశారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధవి

ఘట్‌కేసర్: కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధవి అన్నారు. అవుషాపూర్ స్టార్ బ్యాంకెట్ హాలులో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చేనెల 1 నుంచి 31వ తేదీ వరకు తొమ్మిదేళ్లలో మోదీ పాలనలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, టీఆర్ఎస్ వైఫల్యాలపై ఇంటింటికీ ప్రచారం చేపట్టాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ, మండల, బూత్‌స్థాయి వరకు పార్టీ సంస్థాగతంగా అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్ల ముందుకు సాగడం లేదని, రెండు పడకల ఇళ్ల నేటికీ ఇవ్వలేదని విమర్శించారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు మాట్లాడుతూ ఘట్‌కేసర్‌లో 9 ఏళ్లు గడిచినా రైల్వే వంతెన పనులు పూర్తి కాలేదని, కమీషన్లు వచ్చే పనులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయకుండా దశాబ్ది ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేస్తున్నారని, రుణమాఫీ చేస్తామని రైతులను మోసగించారని విమర్శించారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని, డబ్బుతో ఓటర్లను కొనుగోలు చేయాలని భావిస్తున్నారన్నారు. దళారి టీఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి నరేందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, తిరుమల్‌రెడ్డి, విగ్నేశ్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కార్పొరేటర్ పవన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామోజీ, రఘు, సుధారాణి, మశ్చేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ప్రవీణ్‌రావు

కోడలు మృతికి కారకుడైన మామకు ఐదేళ్ల జైలు

గుండాల: కోడలు మృతికి కారకుడైన మామకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం భువనగిరి కోర్టు తీర్పునిచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మురారిపల్లి గ్రామానికి చెందిన మాధవికి గుండాల మండలం నూనెగూడెం గ్రామానికి చెందిన అండెం నర్సిరెడ్డితో 2011వ సంవత్సరంలో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు జన్మించిన తర్వాత మాధవికి అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో ఆమె ఇంటి వద్దనే ఉంటోంది. కాగా, మామ అండెం సత్తిరెడ్డి వ్యవసాయ పనులకు వెళ్లాలని నిత్యం కోడలిని వేధిస్తున్నాడు. మామ పోరు భరించలేని మాధవి 2017 జూలై 25న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జనగామ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిరోజులకు మాధవి మృతిచెందింది. మృతురాలి తల్లి అనుముల రాధ ఫిర్యాదు మేరకు గుండాల పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనల అనంతరం నేరం రుజువుకావడంతో భువనగిరి జిల్లా జడ్జి బాలభాస్కరరావు నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని గుండాల పోలీసులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధి కేసీఆర్ ఘనతే..

- కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



డబిల్‌పూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: రాష్ట్రంలోని గ్రామాలను అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని గౌడవెల్లి, నూతన్‌కల్, డబిల్‌పూర్, బండమాదారం, రాజబొల్లారం, రాజబొల్లారం తండా, రావల్‌కోల్, సోమారం గ్రామాల్లో రూ.కోటి 50 లక్షల నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. మండలంలోని డబిల్‌పూర్ గ్రామానికి బయోడైవర్సిటీ అవార్డు వచ్చిందని సీఎం కేసీఆర్ చేతులమీదుగా అవార్డు అందుకోవడం అభినందనీయం అన్నారు. గ్రామాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు తమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అన్ని కులాల వారికి రూ.లక్ష పంపిణీ చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్, సర్పంచులు గీతాభాగ్యారెడ్డి, సురేందర్, కవితజీవన్, మహేందర్, మంగ్యానాయక్, శ్యామల, కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, ఎంపీటీసీలు అనుపశ్రీకాంత్‌రెడ్డి, అంకిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



బండమాదారంలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళతో మంత్రి

మంత్రి మల్లారెడ్డికి గ్రామాల్లో నిరసన సెగ..

మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాల సందర్భంగా మంత్రి మల్లారెడ్డికి నిరసన సెగ తగిలింది. బండమాదారం గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ కోసం వికలాంగులు, గ్రామస్తులు నిరసన వ్యక్తం చేయగా డబిల్‌పూర్‌లో కాంగ్రెస్ నాయకులు డ్రైనేజీ పనులు, అభివృద్ధి పనులపై మంత్రిని నిలదీశారు. రావల్‌కోల్ గ్రామంలో బీజేపీ నాయకులు మల్లారెడ్డి గో బ్యాక్ అంటూ మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వృద్ధులు, గ్రామస్తులు క్రషర్ వాహనాల దుమ్ము, రోడ్ల దుస్థితిపై ఆందోళన చేశారు.